క్లుప్తంగా

సీఐ నాగదుర్గారావు బాధ్యతల స్వీకరణ


సీఐ నాగదుర్గారావు

కాకినాడ క్రైం: కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.నాగదుర్గారావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గుడివాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐగా ఉన్న ఆయన, సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ వన్ టౌన్‌కు వచ్చారు. ఆదివారం సాయంత్రం ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు గ్రీవెన్స్

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నియోజకవర్గ స్థాయిలో పిఠాపురం రథాలుపేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎస్ షణ్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖలకు చెందిన నియోజకవర్గ స్థాయి అధికారులు ఉదయం 9.30 నుంచి హాజరు కావాలని ఆదేశించారు.

మొక్కలు నాటే కార్యక్రమం

కాకినాడ రూరల్: కాకినాడ రెండో డివిజన్ శశికాంత్ నగర్‌లో ఆల్ ఈజ్ వెల్ ఫౌండేషన్, మెగా చిరంజీవి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. డాక్టరు చిట్ల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా పాల్గొని, మొక్కనాలు నాటారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

కరప: మండలంలోని రెండు గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాల వారికి కాకినాడకు చెందిన విశ్రాంత చీఫ్ లేబర్ కమిషనర్ వి.శ్రీనివాసరావు రూ.15 వేల ఆర్థికసాయం అందించారు. వలసపాకల గ్రామానికి చెందిన పువ్వల నాగబాబు దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. అలాగే గొర్రిపూడి గ్రామానికి చెందిన గండి ధర్మారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆయా కుటుంబాల ఆర్థిక స్థితిగతులను విశ్రాంత ఉద్యోగి శ్రీనివాసరావుకు వివరించారు. దీంతో స్పందించిన ఆయన నాగబాబుకు రూ.10 వేలు, ధర్మారావు భార్య గండి వరలక్ష్మికి రూ.5 వేలను ఆదివారం అందజేశారు.

వైభవంగా పరదేశమ్మ తీర్థం


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న పరదేశమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లు

తాళ్లరేవు: తాళ్లరేవు గ్రామదేవత పరదేశమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. శనివారం రాత్రి అమ్మవారి పెద్ద జాతర ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ వీధిలోని అమ్మవారి అంగన్‌గుడి నుంచి ఆలయానికి కొత్త అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. గరగ నృత్యాలు, వివిధ రకాల వేషధారణలు, బొమ్మల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాళ్లరేవు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకున్నారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

ఏదీ ఆసరా..!?

- వీధి వ్యాపారులకు కొరవడిన భరోసా
- వడ్డీ లేని రుణాల మాటే మరచిన కూటమి ప్రభుత్వం
- ప్రైవేటుగా అధిక వడ్డీలకు తెచ్చుకుంటున్న వ్యాపారులు
- పాత పథకం కొనసాగించాలంటున్న చిరు వర్తకులు


గాంధీనగర్‌లో వీధి వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులు

బోట్‌క్లబ్: రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీధి వర్తకులకు గత ప్రభుత్వం అండగా నిలిచింది. వారి వ్యాపార పెట్టుబడి కోసం రూ.10 వేలు వడ్డీ లేకుండా రుణం అందించేది. దీంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద నుంచి అప్పులు తీసుకునే పరిస్థితి ఉండేది కాదు. బ్యాంకు రుణాలు సక్రమంగా చెల్లించడంతో, ఆయా బ్యాంకులు వారికి ఇతర రుణాలు సైతం ఇచ్చేందుకు సానుకూలంగా ఉండేవి.

భరోసా లేదు..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి వీధి వ్యాపారులకు భరోసా లేకుండా పోయింది. దీంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీలు తెచ్చుకుని, నిత్యం వ్యాపారం చేసుకుంటూ వారికి వచ్చిన లాభంలో గరిష్ఠ భాగమంతా వడ్డీల కింద చెల్లిస్తున్నారు. రోజుకు రూ.500 సంపాదిస్తే, దానిలో రూ.300 నుంచి రూ.400 వడ్డీ కిందే చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో కుటుంబం గడవడమే వారికి కష్టంగా మారింది.

కష్టం కళ్లారా చూసి..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్ర సందర్భంగా వీధి వ్యాపారులు కష్టం స్వయంగా చూసి చలించిపోయారు. అప్పుడు తీసుకున్న నిర్ణయం మేరకు చిరు వ్యాపారులకు వడ్డీ లేకుండా రుణాలు అందించారు. కాకినాడ నగరంలో 8 వేలకు పైగా వీధి వ్యాపారులకు ప్రతి ఏడాది రుణాలు అందించారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతిఒక్కరికీ ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరే విధంగా వలంటీర్ల సహాయంతో రుణాలు అందించే ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం బ్యాంకులు వీరికి ఎటువంటి రుణాలు మంజూరు చేయడం లేదు.

ఇక వడ్డీ వ్యాపారులే దిక్కు!

వీధి వ్యాపారులకు ఇచ్చే రుణాలకు సంబంధించి ప్రభుత్వం ఆయా బ్యాంకులకు చెల్లించేది. దీంతో బ్యాంకులు సైతం వీధి వ్యాపారులకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చేవి. ప్రస్తుతం బ్యాంకులకు వీధి వ్యాపారుల రుణాల విషయంతో ఎటువంటి మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో, వడ్డీ లేని రుణాలు ఇచ్చే పరిస్థితి దాదాపు కనిపించడం లేదు. దీంతో వీధి వర్తకులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకుని, తమ వ్యాపారాలు చేసుకోవాల్సిన దుస్థితి అనివార్యమైంది.

భ్రష్టు పట్టిస్తున్న ప్రభుత్వం

వడ్డీలేని రుణంతో గత ప్రభుత్వం వీధి వ్యాపారులకు ఎంతో అండగా నిలిచింది. అటువంటి పథకం ప్రస్తుతం కొనసాగించాలని వీధి వ్యాపారులు కోరుకుంటున్నారు. ఈ పథకం ఎన్నో చిరు వ్యాపారుల కుటుంబాలకు అండగా ఉంది. అటువంటి పథకానికి ప్రస్తుతం భ్రష్టు పట్టిస్తుండడంతో వీధి వ్యాపారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగించాలని కోరుతున్నారు. ఈ పథకం కొనసాగించకుంటే, వీధి వ్యాపారస్తులు రోడ్డున పడే పరిస్థితి నెలకొంటుంది.



ఎంతో ప్రయోజనకరంగా ఉండేది

గత ప్రభుత్వమే అండగా నిలిచి వడ్డీ లేకుండా రుణం ఇవ్వడం మాకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. ఇచ్చిన రుణంతో సరకు కొనుగోలు చేసుకుని, ప్రతి రోజు విక్రయించడంతో వచ్చిన డబ్బులు ఇంటికి తీసుకెళ్లేవాళ్లం. ప్రస్తుతం బ్యాంకుల్లో వడ్డీ లేని రుణాలు ఇవ్వడం లేదు. దీంతో బయట వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చుకోవాల్సి వస్తోంది. వడ్డీ లేని రుణాల పథకం కొనసాగించాలి.

– దుగ్గన వెంకన్న, కొబ్బరిబొండాల వ్యాపారి, కాకినాడ

ఘనంగా వేంకటేశ్వరుని పవిత్రోత్సవాలు


స్వామివారి పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: తిరుమల తిరుపతి దేవస్థానాల పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు పిఠాపురంలో ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజ, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఎం.మల్లికార్జున, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సందీప్, విజిలెన్స్ జమెదర్ ఎం.చిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ


సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామి వారు

సామర్లకోట: శ్రావణ మాసం ఆదివారం కావడంతో స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈఓ భళ్ల నీలకంఠం భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం స్వామి వారి ప్రసాద వితరణ, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ అర్చకులు స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అల్లకి రాజగోపాల్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

పోరాట యోధుడు నేతాజీ


బోస్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

కాకినాడ రూరల్: బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సర్పవరం జంక్షన్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. బోస్ చిత్రపటానికి పలువురు ప్రముఖులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత గ్రంథాలయ అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారానే ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టవచ్చని నమ్మి, ఆచరణలో పెట్టిన గొప్ప పోరాట యోధుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. తైవాన్‌లో 1945 ఆగస్టు 18న జరిగిన విమాన ప్రమాదంలో ఆయన వీరమరణం పొందారని భావిస్తున్నారన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరణం ఇప్పటికీ మిస్టరీగానే ఉందని, బ్రిటిష్ ప్రభుత్వం 11 సార్లు జైలులో నిర్బంధించిందన్నారు. ఇండియన్ సివిల్ సర్వీస్ నుంచి వైదొలగి, స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్రను పోషించిన సుభాష్ చంద్రబోస్ నిత్య స్మరణీయుడన్నారు. కార్యక్రమంలో నాయకులు అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రాజా, రాఘవరావు పాల్గొన్నారు.

మేనిఫెస్టోకు ఆకర్షితులమై గెలిపించాం

రేషన్ డీలర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు

కాకినాడ సిటీ: ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టి, డీలర్లకు ఇచ్చే గౌరవ వేతనం, కమీషన్ పెంచుతామని మహా కూటమి నేతలు మేనిఫెస్టోలో పెట్టడంతో తామంతా ఆకర్షితులై, వారిని గెలిపించామని రేషన్ డీలర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు తెలిపారు. ఆదివారం అన్నదాన సమాజంలో జిల్లా రేషన్ డీలర్ల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రేషన్ డీలర్లకు పూర్వ వైభవం రావాలని, తాము ఎన్నో కష్టాలకు గురయ్యామన్నారు. తమకు పట్టణాల్లో రూ.10 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.ఏడు వేల గౌరవ వేతనం అందించి, క్వింటాకు రూపాయిన్నర కమిషన్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 వేల మంది డీలర్లున్నారని, సుమారు పది వేల మంది డీలర్లను పెంచే అవకాశం ఉంటుందని ప్రభుత్వం చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. తమకు ఇబ్బంది లేకుండా కనీస కార్డుదారులను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ల 28న ఆలిండియా రేషన్ డీలర్ల సమావేశం విజయవాడలో జరుగుతుందని తెలిపారు. సమావేశానికి సంఘ జిల్లా అధ్యక్షుడు నందిపాటి పల్లయ్య అధ్యక్షత వహించారు. సంఘ నాయకులు అడపా వెంకటరమణ, బోడపాటి ఫణికుమార్, అన్నపూర్ణ, హేమలత, అప్పలరాజు, ఖాసీం, బాపూజీ, రాంపండు, సోమిశెట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన అను'బంధం'


అశోక్‌నగర్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

- మార్కెట్‌కు రాఖీ పౌర్ణమి శోభ
- దుకాణాల్లో కొనుగోలుదారుల సందడి

బోట్‌క్లబ్: అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలకు సూచకంగా జరుపుకొనే రాఖీ పౌర్ణమి శోభతో కాకినాడ నగరం ఆదివారం సందడిగా మారింది. సోమవారం రాఖీ పౌర్ణమి కావడంతో రాఖీలు కొనుగోలు చేసేందుకు వారంతా దుకాణాలకు రావడంతో పలు ప్రాంతాల్లో రద్దీ ఏర్పడింది. ఫ్యాన్సీ షాపులు, బుక్‌స్టాళ్లు వంటి దుకాణాల వద్ద కొత్త స్టాళ్లను ఏర్పాటు చేసి, రకరకాల రాఖీలు విక్రయించారు. ఒక్కొక్క రాఖీ రూ.10 నుంచి రూ.300 వరకూ విక్రయించారు. గతంలో తక్కువ రేటుకు వచ్చే రాఖీ కూడా ఈసారి ధర పెరిగింది. గతంలో రూ.20 పెట్టిన కొన్న రాఖీ ప్రస్తుతం రూ.40కిపైగా విక్రయించారు. స్థానిక భానుగుడి సెంటర్, అశోక్‌నగర్, పెద్ద మార్కెట్, గోల్డ్ మార్కెట్ సెంటర్, గాంధీనగర్, రామారావుపేట, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో తాత్కాలిక రాఖీల షాపులు వెలిశాయి.


మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన రాఖీలు

స్వీట్ల దుకాణాల వద్ద రద్దీ

రాఖీ పండగ సందర్భంగా అన్నాచెల్లెలు స్వీట్లు కొనుగోలు చేసేందుకు దుకాణాలకు రావడంతో అవి కాస్తా రద్దీగా మారాయి. కొనుగోలుదారులకు ఆకట్టుకునేందుకు రకారకాల స్వీట్లు తయారు చేసి దుకాణ యజమానులు అందుబాటులో ఉంచారు. దీంతో పలు ప్రాంతాల్లో ఉన్న స్వీట్లు దుకాణాలు రద్దీగా మారాయి.

వినాయకుని విగ్రహ ప్రతిష్ఠ

కొత్తపల్లి: మండలంలోని గోర్స గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద గణపతి పూజ, హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పోలియో నిర్మూలనకు రోటరీ కంకణం

డబ్ల్యూహెచ్ఓ మెడికల్ ఆఫీసర్ జాషువా



క్లబ్ భవన నిర్మాణానికి విరాళం అందిస్తున్న వేణునాథరావు

బోట్‌క్లబ్: ప్రపంచం నుంచి పోలియో మహమ్మారిని తరిమేందుకు రోటరీ క్లబ్ కంకణం కట్టుకుందని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ మెడికల్ ఆఫీసర్ జాన్ జుడి జాషువా అన్నారు. స్థానిక సూర్యకళా మందిరంలో ఆదివారం రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో రీజినల్ సెమినార్ నిర్వహించారు. విముక్తి పేరుతో ఈ సెమినార్ జరిగింది. రోటరీ సహకారంతో ఇప్పటికే అన్ని దేశాల్లోను పల్స్‌పోలియో కార్యక్రమం ద్వారా పోలియో రహిత ప్రపంచం చూడబోతున్నామన్నారు. కొన్ని దేశాల్లో కొన్ని పోలియో కేసులు ఉన్నందున పల్స్ పోలియో నిర్వహిస్తున్నట్టు వివరించారు. ప్రముఖ వైద్యురాలు కాళకూరి శైలజ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తు కోసం రోటరీ ఎంతగానో శ్రమిస్తోందన్నారు. ప్రస్తుతం మన దేశంలో పల్స్‌పోలియో కేసులు నమోదు కానప్పటికీ, సమీప దేశంలో ఈ కేసులున్న నేపథ్యంలో ఐదేళ్ల లోపు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో నిర్మూలనకు ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందించాలని జిల్లా పోలియో నిర్మూలన కమిటీ చైర్మన్ మహేష్‌చంద్ జాజు అన్నారు. రోటరీ పోలియో నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు, డాక్టర్ వేంకటేశ్వరరావు, కల్యాణ్ చక్రవర్తి వివరించారు. అనంతరం రోటరీ సెంట్రల్ క్లబ్ సభ్యుడు యడ్లపల్లి వేణునాథరావు సెంట్రల్ క్లబ్ భవన నిర్మాణానికి రూ.50 వేల చెక్కును విరాళంగా అందించారు. కార్యక్రమంలో సెంట్రల్ క్లబ్ అధ్యక్షులు బంగారు కృష్ణమోహన్, సెక్రటరీ దుర్గాప్రసాద్, కో–చైర్మన్ అంకిత్, వీరబాబు, సాగర్, హరిబాబు పాల్గొన్నారు.

వేద సంరక్షణతో సమాజానికి మేలు


వేద స్వస్తి నిర్వహిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: సమాజంలో ప్రతిఒక్కరూ క్షేమంగా జీవనం సాగించడానికి వేదాల సంరక్షణ ఎంతో అవసరమని బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం అధ్యక్షుడు పసుమర్తి సత్యనారాయణ మూర్తి అన్నారు. సంఘం ఆధ్వర్యంలో వేద స్వస్తిని స్థానిక వెంకట్‌నగర్‌లోని శివాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సమాజానికి ఎనలేని సేవలందిస్తున్న ఎస్‌బీఐ సీనియర్ విశ్రాంత అధికారి చీమలకొండ కృష్ణమూర్తిను ఘనంగా సత్కరించారు. అనంతరం పసుమర్తి మాట్లాడుతూ వేద వాఙ్మయ సంరక్షణకే బ్రాహ్మణులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అటువంటి వారికి ప్రభుత్వం సముచిత స్థానం కల్పించడంలో శ్రద్ధ కనబరచకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. వేద స్వస్తి సందర్భంగా పండితులు వల్లిస్తున్న వేద ఘోష ద్వారా ఆ ప్రాంతమంతా పరిమళించే విధంగా మారుతుందన్నారు. పరిసర ప్రాంతాలకు శుభాన్ని చేకూరుతుందన్నారు. సన్మాన గ్రహీత కృష్ణమూర్తి మాట్లాడుతూ సేవా సంఘం ఏర్పాటు చేయడమే కాక, అన్ని బ్రాహ్మణ సంఘాలను పరస్పర స్నేహభావంతో కలుపుకొని ముందుకుసాగాలన్న ఆలోచనను అభినందించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు దివి శ్రీనివాస్ ఆచార్యులు, గరిమెళ్ల లక్ష్మీనారాయణశర్మ, తనికెళ్ల వెంకటరామయ్యశర్మ, ముఖ్య సలహాదారులు నాగ మహాశయా, ఎల్లాప్రగడ పద్మనాభ స్వామి, ఉపాధ్యక్షులు కడియాల సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి పొద్దుటూరి బాలాజి విశ్వనాథ్, ఉప కార్యదర్శి మర్ల జగన్నాథ్ శర్మ, కోశాధికారి కప్పగంతు సాయిరాం శర్మ పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు..!


పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో యండపల్లి జంక్షన్ సమీపంలో పూడ్చకుండా వదిలేసిన పైపులైన్ గొయ్యి

కొత్తపల్లి: పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో యండపల్లి జంక్షన్ సమీపంలో తాగునీటి పైపులైన్ మరమ్మతుల కోసం గొయ్యి తవ్వి, అలాగే ప్రమాదకరంగా వదిలేశారు. ప్రధాన రోడ్డులో ఉన్న పైపులైన్‌కు లీకేజీ కావడంతో నెల రోజుల క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గొయ్యి తవ్వారు. పైపులైన్ మరమ్మతుల పూర్తి చేసినప్పటికీ, గొయ్యిని పూర్తిగా పూడ్చకుండా వదిలేశారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డులోలో ఈ గొయ్యి ఉండడంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో వాహన చోదకులు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ గొయ్యి మధ్యలో ఉండడం వలన ప్రయాణికులకు ఎప్పుడు, ఎలాంటి ముప్పు ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చిత్రం చెప్పే సంగతులెన్నో..


సంధ్యా సమయంలో కనువిందు చేస్తున్న గౌతమీ గోదావరి

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

యానాం: మనిషి జీవన ప్రస్థానంలో రోజూ ఓ మధుర జ్ఞాపకం. ప్రతి మలుపును పదిలంగా కళ్ల ముందుంచేది ఫొటో. ఒక్క చిత్రంలో వేల భావాలు దాగుంటాయి. మారుతున్న రూపాన్ని జీవితాంతం కళ్లకు కడతాయి. ప్రతి ఫొటో వెనుక ఒక జ్ఞాపకం, అనుభూతి ఉంటాయి. పుట్టిన రోజైనా, టూర్‌కు వెళ్లినా ఇలా ఎక్కడ ఏం జరిగినా అక్కడ ఆ జ్ఞాపకాలను పది కాలాల పాటు పదిలంగా ఉంచేందుకు ఫొటో దోహదపడుతుంది. ఫొటోగ్రఫీ రంగంలో వచ్చిన ఆధునికత డిజిటల్ ప్రక్రియతో ప్రస్తుతం పెళ్లికి ముందు అందమైన లొకేషన్లలో ప్రీ వెడ్డింగ్ షూట్ జరుపుకోవడం సర్వసాధారణమైపోయింది. బ్లాక్ అండ్ వైట్ ఫొటోల కాలం నుంచి నేడు ఫోన్ ద్వారా సెల్ఫీ, డ్రోన్ కెమెరాల దశకు కెమెరా కన్ను విస్తరించింది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా యానాం పరిసర ప్రాంతాల్లో క్లిక్‌మనిపించిన అందమైన చిత్రమాలికలివి..


గోదావరిలో నావలపై మత్స్యకారుల శ్రమైక సౌందర్యం

ముగిసిన మరిడమ్మ జాతర

- భారీ అన్న సమారాధన
- వేలాదిగా హాజరైన భక్తులు


అన్న సమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు


అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఏటా శ్రావణ మాసం ఆరంభంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తారు. దీనిలో భాగంగా ఆదివారం ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్న సమారాధనను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ప్రారంభించారు. తొలుత ఆలయ అర్చకులు మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధనలో వేలాదిగా భక్తులు హాజరై, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తూతిక రాజు, రంధి సత్యనారాయణ, కొరుపూరి రాజు, ఆరిఫ్ ఆలీ, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు

అమ్మవారి దర్శనానికి భక్తులకు క్యూలో రెండు గంటల సమయం పట్టింది. జాతర మహోత్సవాల్లో భాగంగా శ్రావణ మాసం రెండో ఆదివారం మరిడమ్మను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీ క్యూ కట్టారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టారు. డీఎస్పీ లతా కుమారి ఆదేశాల మేరకు సీఐ టి.క్రాంతికుమార్ పర్యవేక్షణలో ఎస్సై మౌనిక భారీ బందోబస్తు నిర్వహించారు.